క్లుప్తంగా

తహసీల్దార్ కార్యాలయం తనిఖీ



తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు

చివ్వెంల : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని శనివారం అదనపు కలెక్టర్ పి. రాంబాబు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కార్యాలయ రికార్డులు పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూభారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలన్నారు. క్షేత్రస్థాయి పరిశీలన చేసేటప్పుడు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రకాశ్‌రావు, ఆర్ఐలు శ్రావణి, శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి

నూతనకల్ : భూమి పట్టా కలిగిన ప్రతి ఒక్కరూ ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలని మండల వ్యవసాయ అధికారి మురళీ కోరారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న వివిధ పథకాల్లో లబ్ధిపొందుటకు ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరిగా ఉండాలన్నారు. సమీపంలోని ఆన్‌లైన్ సెంటర్‌లకు వెళ్లి ఆగస్టు 5వరకు నమోదు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ జానయ్య పాల్గొన్నారు.

బ్లీచింగ్ పౌడర్ అందజేత

అర్వపల్లి : కొమ్మాలలో పారిశుద్ధ్య సమస్య తలెత్తకుండా జాజిరెడ్డిగూడెం ఉమ్మడి మండల పీఏసీఎస్ చైర్మన్ కుంట్ల సురేందర్‌రెడ్డి శనివారం గ్రామ పంచాయతీకి స్వచ్ఛందంగా రెండు బస్తాల బ్లీచింగ్ పౌడర్‌ను అందజేశారు. అన్ని వీధులు శుభ్రంచేయించి వీధులు, కాలువల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నారాయణమూర్తి, ఏఎస్ఎం అనంతుల సరస్వతి, బచ్చాటి ప్రవీణ్, కుదురుపాక ఉదయ్, వెంకటాద్రి, వీరారెడ్డి, సైదులు, ఉపేందర్, శ్రీరాములు, యాదగిరిరెడ్డి, గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

నాగారం : సీఎం సహాయనిధిని బాధితులు సద్వినియోగం చేసుకోవాలని యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యాకూబ్‌వలీ అన్నారు. శాంతినగర్ గ్రామానికి చెందిన లింగాల పద్మ ఇటీవల అనారోగ్యానికి గురికావడంతో ఆమెకు ప్రభుత్వం నుంచి రూ.16,000 సీఎంఆర్ఎఫ్ చెక్కు మంజూరైంది. ఆ చెక్కును యాకూబ్‌వలీ శనివారం బాధితురాలి భర్త లింగాల శంకర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పొలిల లింగయ్య, షేక్.సైదులు, చిప్పలపల్లి శేఖర్, షేక్ బడేసాబ్, షేక్ అక్బర్ పాష, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికశాఖ ఆమోదంపై హర్షం

నాగారం : ఆదర్శ పాఠశాలలు/కళాశాలల్లో పని చేస్తున్న హవర్లీ బేస్డ్ టీచర్స్(హెచ్‌బీటీ) వేతనాలకు సంబంధించిన ఫైల్ శనివారం ఆర్థికశాఖ ఆమోదం పొందడం హర్షణీయమని ఆదర్శ పాఠశాలల, కళాశాలల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రెడ్డబోయిన నాగరాజు అన్నారు. శనివారం మండల కేంద్రంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఆర్థిక శాఖ ఆమోదంతో రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న 1200 మంది హెచ్‌బీటీలకు ప్రతి నెలా వేతనాలు సకాలంలో అందుతాయని తెలిపారు. ఆయనతో పాటు ఆ సంఘం నాయకులు తదితరులు ఉన్నారు.

బస్సులో ప్రయాణికురాలి బంగారం చోరీ

సూర్యాపేట టౌన్ : ఆర్టీసీ బస్సులో మహిళా ప్రయాణికురాలి బంగారం, నగదు అపహరణకు గురైంది. మహిళ శనివారం కట్టంగూరు బస్టాండ్‌లో బస్సు ఎక్కి సూర్యాపేటకు వచ్చింది. ఆమె పర్సులో ఉన్న మూడు తులాల బంగారం, రూ.3 వేల నగదు గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. సదరు మహిళ సూర్యాపేట కొత్త బస్టాండ్ వచ్చాక తన పర్సు కనిపించకపోవడంతో లబోదిబోమంది. వెంటనే పట్టణ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా అక్కడ పోలీసులు కట్టంగూరు పోలీస్ స్టేషన్ లోనే ఫిర్యాదు ఇవ్వాలని సూచించడంతో ఆమె అక్కడకు వెళ్లినట్లు తెలిసింది.

న్యాయం చేయాలి

మునగాల : ఉద్యోగ నియామకాల్లో స్పెషల్ బీఈడీ అభ్యర్థులకు న్యాయం చేయాలని భారత వికలాంగుల హక్కుల పోరాట సమితి (బీవీహెచ్‌పీఎస్) రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని తిమ్మారెడ్డిగూడెంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం 2024లో చేపట్టిన డీఎస్సీ నియామకాల్లో ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లల కోసం బోధించే స్పెషల్ బీఈడీ అభ్యర్థులకు తీవ్ర అన్యాయం చేసిందని ఆరోపించారు. కార్యక్రమంలో బీవీహెచ్‌పీఎస్ మండల శాఖ అధ్యక్షుడు గోపిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొల్లూరి ఈదయ్య బాబు, సంఘం విద్యార్థి విభాగం రాష్ట్ర నాయకులు వాకుడోతు లాల్‌సింగ్, డి.కృష్ణ కిషోర్ పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

• ఎమ్మెల్యే మందుల సామేల్

తిరుమలగిరి : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తోందని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శుక్రవారం తిరుమలగిరి మండలంలోని రాఘవపురంలో నూతన గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం జలాల్‌పురం, సిద్ధిసముద్రం తండాలలో నూతన గ్రామ పంచాయతీ కార్యాలయాల భవన నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా రాఘవపురం, జలాల్‌పురం గ్రామ పంచాయతీలకు స్థలాన్ని ఇచ్చిన దాత కేతిరెడ్డి సత్యనారాయణరెడ్డిని శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎల్సోజు చామంతి, వర్కింగ్ ప్రెసిడెంట్ జమ్మిలాల్, ఎంపీడీఓ లాజరస్, కార్యదర్శి సరిత, మాజీ సర్పంచ్ మహేష్, దాచేపల్లి వెంకన్న, వీరేష్, అబ్బాస్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రేషన్ కార్డులు అందుతాయి

అర్హత కలిగిన అందరికీ రేషన్ కార్డులు అందుతాయని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. శనివారం తిరుమలగిరి మున్సిపల్ కేంద్రంలోని శుభమస్తు ఫంక్షన్ హాల్‌లో నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రేషన్ కార్డుల మంజూరు నిరంతర ప్రక్రియ అని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన 6 గ్యారంటీ పథకాలను వంద శాతం అమలు చేస్తుందని అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ ఎల్సోజు చామంతి నరేష్, పీఏసీఎస్ చైర్మన్ పాలెపు చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ పట్టణ శాఖ అధ్యక్షుడు పేరాల వీరేష్, జమ్మిలాల్, రాపాక సోమేష్, తహసీల్దార్ హరిప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్ జాన్‌మహ్మద్, ఎంపీడీఓ లాజరస్ పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

తిరుమలగిరి : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మద్దిరాల మండల కేంద్రంలో 15వ ఆర్థిక సంఘం(ఎఫ్ఎఫ్‌సీ) నిధులు రూ.143లక్షలతో చేపడుతున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణ పనులకు శనివారం ఆయన శంకుస్థాపన చేశారు. తొమ్మిది నెలల్లో హాస్పిటల్‌ను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముక్కాల అవిలమల్లు యాదవ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చింతకుంట్ల వెంకన్న, ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి, తహసీల్దార్ అయేషా పర్వీన్, పీఆర్ డీఈఈ లింగనాయక్, ఏఈ కళ్యాణ్, ఏఓ అనిషారూహి, నియోజకవర్గ బ్లాక్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు పచ్చిపాల సుమతి వెంకన్న, డైరెక్టర్ కొమ్ము వెంకన్న, వాసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, పలువురు నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



జలాల్‌పురంలో జీపీ భవనానికి స్థలాన్ని ఇచ్చిన దాతను సన్మానిస్తున్న ఎమ్మెల్యే



మద్దిరాలలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సామేల్

ముఖ గుర్తింపు ద్వారా చేయూత పింఛన్లు

• కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

భానుపురి : చేయూత పింఛన్లను ముఖ గుర్తింపు ద్వారా పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లో పంచాయతీ అధికారులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఈ నెల నుంచి బయోమెట్రిక్ విధానానికి స్వస్తి పలికి మొబైల్ యాప్ ద్వారా లబ్ధిదారుల ముఖ గుర్తింపు విధానంతో లబ్ధిదారులకు పింఛన్ అందజేయనున్నట్లు తెలిపారు. అన్ని శాఖలు సమన్వయం చేసుకుంటూ వనమహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. మొక్కలను నాటడంతోపాటు వాటికి నీరు పోసి కాపాడాలని తెలిపారు. వర్షాకాలం నేపథ్యంలో ఎప్పటికప్పుడు శానిటేషన్ చేయాలని, సీజనల్ వ్యాధులు రాకుండా దోమలు ఉన్న చోట, నీరు నిల్వ ఉన్న చోట ఆయిల్ బాల్స్ వేయాలని, దోమల మందు స్ప్రే చేయాలని అన్నారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ వీవీ అప్పారావు, డీపీఓ యాదగిరి, జెడ్పీ డిప్యూటీ సీఈఓ శిరీష, డీఎల్‌పీఓ నారాయణరెడ్డి, పోస్టల్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర రావు, ఎంపీడీఓలు, ఎంపీఓలు, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్

అదనపు కలెక్టర్ పూజలు

అర్వపల్లి : శ్రావణ మాసం సందర్భంగా అర్వపల్లిలోని శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయాన్ని శనివారం అదనపు కలెక్టర్ రాంబాబు కుటుంబ సమేతంగా సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. వారిని దేవస్థాన చైర్మన్ అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో తహసీల్దార్ బాషపాక శ్రీకాంత్, గిర్దావర్ పాటి వెంకట్‌రెడ్డి, అర్చకులు రాంబాబుఅయ్యంగార్, పవన్‌కుమార్, తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న అదనపు కలెక్టర్ రాంబాబు

స్వచ్ఛతకు ముందడుగు వేయాలి



46వ వార్డులో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడుతున్న మున్సిపల్ డీఈ సత్యారావు

సూర్యాపేట : స్వచ్ఛత కోసం ప్రజలంతా కలిసికట్టుగా ముందడుగు వేయాలని మున్సిపల్ డీఈ సత్యారావు అన్నారు. మున్సిపల్ కమిషనర్ హనుమంత రెడ్డి ఆదేశాల మేరకు శనివారం 46వ వార్డులో 100 రోజుల ప్రణాళికలో భాగంగా సమావేశం నిర్వహించారు. వార్డులలో మౌలిక సదుపాయాలపై సమీక్ష చేపట్టి, ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇళ్లలోని తడి, పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ వాహనాలకు ఇవ్వాలని అన్నారు. పట్టణ అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం పెరగాలని కోరారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, మున్సిపల్ టీపీఓ ఉయ్యాల సోమయ్య, ఏఈ తిరుమలయ్య, రాజు రెడ్డి, రెవెన్యూ అధికారులు ఎండీ గౌసుద్దీన్, ఇండ్ల మనోజ్, యాదగిరి, టీఎంసీ శ్వేత, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ శివప్రసాద్, హెల్త్ వర్కర్లు, దంతాల వీరయ్య, సందీప్, వార్డు అధికారి సరిత, సువర్ణ కాలనీ ప్రతినిధులు, బీఆర్ఎస్ పార్టీ వార్డు ఇన్‌చార్జ్ భావ్‌సింగ్, మహిళా సంఘాల సభ్యులు, యువత, పట్టణ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చూడాలని వినతి

సూర్యాపేట అర్బన్ : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతూ పీఓడబ్ల్యూ, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ ఈఈ కిరణ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక మాట్లాడారు. పట్టణంలో డ్రెయినేజీ వ్యవస్థ సరిగాలేదని, సైడ్ కాలువలు చెత్త చెదారంతో నిండి దుర్గంధాన్ని వెదజల్లుతున్నాయని తెలిపారు. కొన్ని నెలల నుంచి దోమల మందు పిచికారీ చేయడం లేదని, బ్లీచింగ్ పౌడర్ చల్లడం లేదని అన్నారు. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి పట్టణ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎర్ర అఖిల్ కుమార్, పీఓడబ్ల్యూ జిల్లా ఉపాధ్యక్షుడు సూరం రేణుక, జిల్లా కమిటీ సభ్యులు ఐతరాజు పద్మ, కల్పన, పద్మ, టీయూసీఐ జిల్లా సహాయ కార్యదర్శి గోగుల వీరబాబు, విజయ్ పాల్గొన్నారు.

విష జ్వరాల నుంచి రక్షించాలి

విష జ్వరాల బారి నుంచి ప్రజలను రక్షించాలని సీపీఎం వన్ టౌన్ కార్యదర్శి వల్లపు దాసు సాయికుమార్ అన్నారు. శనివారం 8వ వార్డు ఇందిరమ్మ కాలనీలో ఆయన మాట్లాడారు. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాల మూలంగా ప్రజలు టైఫాయిడ్, చికెన్ గున్యా, డెంగీ, మలేరియా వంటి వ్యాధులతో బాధపడుతున్నారని అన్నారు. అంటు వ్యాధులు, విష జ్వరాలు ప్రబలకుండా వార్డులలో పారిశుద్ధ్య చర్యలు వేగవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో టేకుల సుధాకర్, వెంకన్న, ఎల్గూరి నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.



మున్సిపల్ ఈఈకి వినతిపత్రం అందజేస్తున్న పీఓడబ్ల్యూ, పీడీఎస్‌యూ నాయకులు

మృతుల కుటుంబాలకు ఆర్థికసాయం



ఆత్మకూర్ (ఎస్) : యాదగిరిరెడ్డి భార్యకు ఆర్థికసాయం అందజేస్తున్న పటేల్ రమేష్‌రెడ్డి

ఆత్మకూర్ (ఎస్) : కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మర్కాల యాదగిరి రెడ్డి మృతి తీరనిలోటు అని పర్యాటక అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని తుమ్మల పెన్‌పహాడ్ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మర్కాల యాదగిరి రెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. శనివారం బాధిత కుటుంబ సభ్యులను పటేల్ రమేష్‌రెడ్డి పరామర్శించారు. రూ.1,50,000 ఆర్థికసాయాన్ని యాదగిరిరెడ్డి సతీమణి పుష్పమ్మ, కుమారుడు ప్రమోద్‌రెడ్డికి అందించారు. అనంతరం మృతుడి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఫరూక్, వెలుగు వెంకన్న, పిల్లల రమేష్ నాయుడు, గట్టు శ్రీను, దేవేందర్ రెడ్డి, దొంతిరెడ్డి సైదిరెడ్డి, కొంగల జానయ్య, చిలుముల గోపాల్ రెడ్డి, అరవింద్ రెడ్డి, కోతి ఉపేందర్, గునగంటి మల్సూర్, కరుణాకర్ రెడ్డి, మహేష్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : అర్వపల్లికి చెందిన మర్రి గోవింద్ శనివారం అనారోగ్యంతో మృతిచెందాడు. ఎన్నారై ఈదుల శ్రీనివాస్ రూ.10 వేల ఆర్థికసాయం పంపించగా.. ఆ నగదును యూత్‌కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు వేల్పుల రమేష్ మృతుడి కుటుంబీకులకు అందజేశారు. మృతుడికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ బైరబోయిన సైదులు, బైరబోయిన రామలింగయ్య, కనుకు శ్రీనివాస్, మేడెబోయిన సోమనర్సయ్య, పులిచర్ల ప్రభాకర్, సాయిని యాగానందం, కొమారి మహేష్, మామిడి మల్లేష్, కొమారి వీరయ్య తదితరులు పాల్గొన్నారు.

నాగారం : మండల పరిధిలోని ఫణిగిరి గ్రామానికి చెందిన కడారి వెంకటయ్య శనివారం అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడి భౌతిక కాయాన్ని కాంగ్రెస్ గ్రామశాఖ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు సందర్శించి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, గ్రామశాఖ ఆధ్వర్యంలో రూ.5,000 ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎర్ర యాదగిరి, పానుగంటి నర్సింహారెడ్డి, ముదిరెడ్డి శేఖర్‌రెడ్డి, బత్తుల కర్ణాకర్, యాట భాస్కర్, జంపాల రవి, అవిలయ్య, గట్టు లక్ష్మీకాంత్, కసిరెడ్డి రాంరెడ్డి, మందుల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన



నాగారం జెడ్పీహెచ్ఎస్‌లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీహెచ్ఓ బిచ్చునాయక్



నూతనకల్ మండలం తాళ్లసింగారంలో అవగాహన కల్పిస్తున్న సీహెచ్ఓ శరణ్‌నాయక్

తిరుమలగిరి : తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా అరికట్టాలని సీహెచ్ఓ శరణ్‌నాయక్ అన్నారు. శనివారం నూతనకల్ మండల పరిధిలోని తాళ్లసింగారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సీజనల్ వ్యాధులు, పరిసరాల పరిశుభ్రతపై విద్యార్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు సోమయ్య, ఝాన్సీ, శాంత, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

నాగారం : వర్షాకాలంలో వచ్చే సీజనల్ వ్యాధుల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సామాజిక ఆరోగ్య అధికారి మాలోతు బిచ్చునాయక్ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ప్రాథమిక, జెడ్పీహెచ్ఎస్‌లలో విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ యనగందుల నాగరాజు, హెచ్ఎంలు జ్ఞానేశ్వరచారి, రాందాస్‌నాయక్, హెల్త్ ఎడ్యుకేటర్ విమలమ్మ, సూపర్‌వైజర్ రామచంద్ర, పీహెచ్ఎన్ఓ అరుణకుమారి, నాగమ్మ, ఉపాధ్యాయులు, ఆశ కార్యకర్తలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

చదువుతోనే సమాజంలో గౌరవం

తుంగతుర్తి : చదువుతోనే సమాజంలో గౌరవం లభిస్తుందని జడ్జి ఎండీ గౌస్‌పాషా అన్నారు. శనివారం మండల కేంద్రంలోని కస్తూరిబాగాంధీ విద్యాలయంలో మండల లీగల్ సెల్ లిట్రసీ ఆధ్వర్యంలో విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు గొప్ప వ్యక్తులను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలన్నారు. క్రమశిక్షణ, పట్టుదలతో లక్ష్యాన్ని సులభంగా సాధించవచ్చని తెలిపారు. అనంతరం చట్టాలు, హక్కులు, బాల్యవివాహాలు, అక్షరాస్యత, సైబర్ నేరాల పట్ల అప్రమత్తత, సెల్ ఫోన్ల వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అన్నెపర్తి జ్ఞానసుందర్, ఎంఈఓ బోయిని లింగయ్య, సీఐ నరసింహారావు, న్యాయవాదులు తాళ్లపల్లి సత్యనారాయణ, గుగులోతు రాజారాం నాయక్, జిలకర చంద్రమౌళి, జిల్లా కుమారస్వామి, కారింగుల వెంకటేశ్వర్లు, సతీష్, ఎస్ఓ, ఉపాధ్యాయులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి ఎండీ గౌస్‌పాషా

ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేయాలి



మాట్లాడుతున్న సంకినేని వరుణ్‌రావు

తిరుమలగిరి : స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి కార్యకర్త సైనికుడిలా పనిచేసి బీజేపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు సంకినేని వరుణ్‌రావు అన్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల దృష్ట్యా శనివారం మద్దిరాల మండల కేంద్రంలో నిర్వహించిన సన్నాహక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కార్యకర్తలకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కౌన్సిల్ మెంబర్ భూతం సాగర్, మండల అధ్యక్షుడు వడ్డాణం కిరణ్‌కుమార్, జిల్లా నాయకులు జలగం అచ్చయ్య గౌడ్, గాడ్డుల లింగయ్య, విక్రమాచారి, వల్లపు అశోక్, బొమ్మెర నరేష్, ఎలిమినేటి రాము, కొయ్యగూరు లింగరాజు, ధనియాల శంభయ్యనాయుడు, కొంపెల్లి గంగాధర్, పొన్నం శేఖర్, భూతం మల్లయ్య, పలువురు నాయకులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు

సూర్యాపేట : రైతులకు ఇబ్బందులు కలగకుండా యూరియా అందుబాటులో ఉంచాలని డీసీఓ పద్మ సూచించారు. శనివారం సూర్యాపేట జిల్లా కేంద్రం పరిధిలోని పిల్లలమర్రి ఎరువుల గోదాంను సందర్శించి ఆమె మాట్లాడారు. ఉదయం 8 గంటల లోపే షాపులు తెరవాలని సూచించారు. జిల్లాలో ఎరువుల అలాట్మెంట్ ఎంత ఉంది, రైతులకు ఏ మేరకు విక్రయించారు, ఎంత అందుబాటులో ఉందనే వివరాలను వ్యవసాయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పీఏసీ అసిస్టెంట్ రిజిస్టర్ బి.అంజయ్య, సంఘ సెక్రటరీ జే. శ్యాంసుందర్ రెడ్డి, సంఘ సిబ్బంది వి.వెంకట్ రెడ్డి, వెంకటేష్, వెంకన్న, నవకాంత్, నాగరాజు, పలువురు రైతులు తదితరులు పాల్గొన్నారు.



ఎరువుల గోదాంను పరిశీలిస్తున్న డీసీఓ పద్మ

డిప్యుటేషన్ రద్దు చేయాలని ఆందోళన



పాఠశాలలో ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలుపుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ఆత్మకూర్ (ఎస్) : మండల పరిధిలోని నెమ్మికల్ హరిజనవాడ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు సుధారాణి డిప్యుటేషన్ రద్దు చేయాలని తల్లిదండ్రులు శనివారం పాఠశాలలో నిరసన తెలిపారు. పాఠశాలలో పిల్లలతో మమేకమై కొత్త పిల్లలు పాఠశాలలో చేరడానికి ఎంతో ప్రోత్సహించిన ఉపాధ్యాయురాలిని డిప్యుటేషన్‌పై కోటినాయక్ తండాకు పంపడంతో తమ పిల్లలు తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. వెంటనే డిప్యుటేషన్‌ను రద్దు చేయాలని, అదేవిధంగా పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిల్లల తల్లిదండ్రులు నాగరాజు, సందీప్, శ్రీను, అనిల్, మానస, చక్రయ, మమత, సుజాత, రాజేష్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పీవైఎల్ కౌన్సిల్ సభను జయప్రదం చేయాలి

సూర్యాపేట అర్బన్ : హైదరాబాద్‌లోని విద్యానగర్‌లో ఆదివారం జరిగే ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) రాష్ట్ర జనరల్ కౌన్సిల్ సభను జయప్రదం చేయాలని పీవైఎల్ జిల్లా ఉపాధ్యక్షుడు కట్ట రమేష్ పిలుపునిచ్చారు. శనివారం పట్టణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఉద్యమ కార్యాచరణ నిర్మాణం కోసం నిర్వహించే కౌన్సిల్ సమావేశంలో యువత అధిక సంఖ్యలో పాల్గొనాలని అన్నారు. ఈ కార్యక్రమంలో పీవైఎల్ నాయకులు పిడమర్తి అర్జున్, బయ్యా గణేష్, పాల్వాయి ప్రవీణ్, గోగుల వీరబాబు పాల్గొన్నారు.

నోట్‌బుక్స్, పెన్నులు అందజేత



నోట్‌బుక్స్, పెన్నులు అందజేస్తున్న బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పరెడ్డి సీతారాంరెడ్డి

పెన్‌పహాడ్ : మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పరెడ్డి సీతారాంరెడ్డి జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో 60మంది విద్యార్థులకు నోట్‌బుక్స్, పెన్నులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి వ్యక్తిగత కార్యదర్శి బసిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ నెమ్మాది భిక్షం, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దొంగరి యుగేందర్, పీఏసీఎస్ చైర్మన్ వెన్న సీతారాం రెడ్డి, మండల యూత్ అధ్యక్షుడు అనంతుల శ్రీనివాస్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

చెరువులు, కుంటలు నింపాలి



మాట్లాడుతున్న కొలిశెట్టి యాదగిరిరావు

అర్వపల్లి : గోదావరి జలాలను విడుదల చేసి చెరువులు, కుంటలు నింపాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అర్వపల్లిలో శనివారం జరిగిన సీపీఎం మండల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాలువలకు మరమ్మతులు చేపట్టాలన్నారు. ఎరువుల కొరతను తీర్చాలని, అధిక ధరలకు విక్రయిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు నిర్మించాలన్నారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి వజ్జె శ్రీనివాస్, మండల కమిటీ సభ్యులు శిగ వెంకన్న, కొప్పోజు సరోజ, సంపతి వెంకన్న, ఎల్లంల అవిలయ్య, వజ్జె సైదయ్య, రాజయ్య, అబ్బులు, కృష్ణయ్య, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిలో పశువుల పాకలు

• పాడి రైతులకు ప్రయోజనం

చివ్వెంల : ఉపాధి హామీ పథకం కింద పశువుల షెడ్ల నిర్మాణానికి ప్రభుత్వం 100 శాతం రాయితీ అందిస్తోంది. ఈ పథకం ద్వారా రైతులు తమ పశువులకు సురక్షితమైన, సరైన ఆవాసాలను నిర్మించుకోవచ్చు. ఇప్పటికే మండలవ్యాప్తంగా 65 మంది అర్హులైన రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పశువుల పాకలను నిర్మించుకున్నారు. ఇది మాత్రమే కాకుండా మండలానికి రూ.3 లక్షలతో ఒక కోళ్ల ఫారం మంజూరైంది. ప్రస్తుతం బద్యాతండాలో కోళ్ల ఫారం నిర్మాణంలో ఉంది.

అర్హత, నియమ నిబంధనలు..

అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకుంటే వారికి పశువుల పాకలతో పాటు, జీవాల పెంపకానికి కూడా షెడ్ల నిర్మాణానికి అవకాశం కల్పిస్తామని అధికారులు తెలియజేశారు. అయితే, ప్రభుత్వ నిబంధనల ప్రకారం షెడ్ల నిర్మాణం చేపట్టాల్సి ఉంటుంది. పశువుల పాక నిర్మించాలనుకునే రైతులకు తప్పనిసరిగా ఉపాధి హామీ జాబ్ కార్డు ఉండాలి. ఐదు ఎకరాల లోపు భూమి కలిగి ఉండాలి. షెడ్‌ను 5 మీటర్ల పొడవు, 4 మీటర్ల వెడల్పు, 2.4 మీటర్ల ఎత్తుతో నిర్మించాలి. ఈ కొలతలతో నిర్మించిన షెడ్‌లో 3 నుంచి 6 పశువులకు ఆవాసం కల్పించవచ్చు. సరైన కొలతలతో షెడ్ నిర్మిస్తే ప్రభుత్వం గరిష్ఠంగా రూ. 85 వేలు అందిస్తుంది. అయితే, షెడ్ నిర్మాణానికి అయ్యే ఖర్చును లబ్ధిదారులే ముందుగా భరించాల్సి ఉంటుంది. నిర్మాణం పూర్తయిన తర్వాత ప్రభుత్వ నిధులు వారి ఖాతాలో జమ చేయబడతాయి. పాడి రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ పశువుల సంరక్షణను మెరుగుపరుచుకోవాలని, తద్వారా ఆర్థికంగా బలోపేతం కావాలని అధికారులు సూచిస్తున్నారు.



పశువుల పాకను పరిశీలిస్తున్న అధికారులు

ఎంతో ఉపయోగకరం



పశువుల పాక నిర్మాణం పాడి రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. ఒకప్పుడు పశువులను మేపేందుకు ఇబ్బంది పడే వాళ్లం. పాక నిర్మాణం తర్వాత పశుపోషణ సులభం అయింది. కానీ పాక నిర్మించి నాలుగు నెలలు పూర్తయినా డబ్బులు రాలేదు. ముందుగానే డబ్బులు వచ్చే విధంగా అధికారులు చర్యలు తీసుకుంటే ఎక్కువ మంది అర్హులు పాకలు నిర్మించుకునే అవకాశం ఉంటుంది.

– రమాదేవి, రైతు, చివ్వెంల

అర్హులందరికీ అవకాశం



మండలంలో పశువుల పాకల నిర్మాణాల్లో అనుకున్న లక్ష్యాన్ని సాధించాం. అర్హులైన వారు ఎంత మంది ఉన్నా దరఖాస్తు చేసుకుంటే ఉపాధిహామీలో అవకాశం కల్పిస్తాం. కానీ ముందుగా డబ్బులు వచ్చే అవకాశం లేదు. నిర్మాణం పూర్తయిన తర్వాతే డబ్బులు వస్తాయి. వారంలో అందరి ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయి.

– ఇరుగు నాగయ్య, ఏపీఓ, చివ్వెంల